సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 9లో



ఉపాధి పనులపై 'ప్రజావేదిక'

భువనగిరి మండల పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. - 9లో



ఫిలిం ఫెస్టివల్‌కు ఎంపిక

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితచరిత్ర ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీ ఫిలిం ఫెస్టివల్‌కు ఎంపికైంది. - 10లో

న్యూస్‌రీల్

నేడు సేవాలాల్ జయంతి

భువనగిరి టౌన్ : శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను గురువారం ఉదయం 10.30 గంటలకు భువనగిరిలోని రావి భద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ కృష్ణన్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. అలాగే యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలోనూ సేవాలాల్ జయంతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆహ్వానితులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరురూరల్ : పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. బుధవారం ఆలేరులోని తహసీల్దార్ కార్యాయలంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయన్నారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు మోహన్‌రావు, చింతకింది మురళి, చెక్క వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకామూర్తులకు సుప్రభాత సేవ, అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మండపంలో, అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రంగరాజన్

భువనగిరి : పర్యావరణ పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ రంగరాజన్ తెలిపారు. జాతీయ హరిత దళం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి డ్రామా, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్జీసీ స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ రాధిక, జిల్లా సైన్స్ అధికారి భరణికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలతో పాటు ఇళ్లు, పరిసర ప్రాంతాల్లోనూ పర్యావరణాన్ని కాపాడే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే జీవ మనుగడ సాధ్యమన్నారు. అనంతరం ఏకపాత్రాభినయ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులురాలు నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్

భువనగిరి టౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు కౌన్సిలర్ వెంకట్ నాయక్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆయనకు పార్టీ కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

• సారలమ్మకు మొక్కులు



సమ్మక్క, సారలమ్మ జాతర మొదటి రోజు బుధవారం రాజాపేట మండలంలోని చిన్నమేడారంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

• వైభవంగా నృసింహుడి ఎదుర్కోలు



యాదాద్రి పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవారి ఎదుర్కోలు సందర్భంగా ఉత్సవమూర్తులను తిరువీధి సేవకు తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది



శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

టెండర్లు దాటని పనులు

శాశ్వత భవనాలకు నోచుకోని ఆరోగ్య ఉప కేంద్రాలు

- ఆరు నెలల క్రితం నిధులు మంజూరు
- ఇప్పటి వరకు మొదలు కాని నిర్మాణాలు
- ఇరుకు గదులు, సౌకర్యాల లేమితో ఇబ్బంది పడుతున్న రోగులు



రామన్నపేట మండలం వెల్లంకిలో అద్దె భవనంలో కొనసాగుతున్న హెల్త్ సబ్ సెంటర్



రామన్నపేటలో హెల్త్ సబ్ సెంటర్ భవన కోసం వేసిన శిలాఫలకం

రామన్నపేట : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉపకేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. అద్దె భవనాలు, అరకొర సౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. పక్కా భవనాల కోసం ఆరు నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించడం లేదు. నాలుగు చోట్ల మినహా మరెక్కడా టెండర్ల దశ కూడా దాటలేదు.

25 సబ్ సెంటర్లకు నిధులు

జిల్లాలోని 17మండలాల పరిధిలో 135 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 43 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగతా కేంద్రాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 25 సబ్ సెంటర్లకు పక్కా భవనాల కోసం ఆరు నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. ఒక్కో కేంద్రానికి రూ.20 లక్షల చొప్పున రూ.5 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణాలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు టెండర్ల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మంజూరైన భవనాలు..

భూదాన్‌పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జూలూరు, శివారెడ్డిగూడెం, బొల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం, నందనం, వడపర్తి, వర్కట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రాద్దుటూరు, ఆత్మకూరు(ఎం) పీహెచ్‌సీ పరిధిలోని కొరటికల్, సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని చిల్లాపురం, గుజ్జ, జనగాం, మహ్మదాబాద్, పుట్టపాకలో, తంగడపల్లి పీహెచ్‌సీ పరిధిలోని డి.నాగారం, కుంట్లగూడెం, మునిపంపుల పీహెచ్‌సీ పరిధిలోని లక్ష్మాపురం, రామన్నపేట, సిరిపురం, వెల్లంకిలో సబ్ సెంటర్లకు శాశ్వత భవనాలు మంజూరయ్యాయి. వీటితో పాటు అడ్డగూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గట్టుసింగారం, కంచనపల్లి, కోటమర్తి గ్రామాల్లో, మోత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని దాచారం, పాటిమట్ల, పొడిచేడు సబ్ సెంటర్లకు సొంత భవనాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించారు. అంతకు ముందు మరో నాలుగు హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

సబ్‌సెంటర్ల భవనాల నిర్మాణం కోసం అసెంబ్లీ ఎన్నికల ముందు టెండర్లు పిలిచారు. కేవలం నాలుగు సెంటర్లకు మాత్రమే టెండర్లు వచ్చాయి. మిగిలిన 21 భవనాలకు టెండర్లు దాఖలు చేయడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. ఎన్నికల నిర్వహణలో నిమగ్నమైన యంత్రాంగం తదుపరి చర్యలను చేపట్టలేదు.

అన్నీ సమస్యలే..

ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో రోగులతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చాలా భవనాలు ఇరుకుగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరాయి. సౌకర్యాలు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులకు నాణ్యమైన సేవలు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో పలు కేంద్రాల్లోకి నీరు వచ్చి చేరుతుంది. వెంటనే శాశ్వత భవనాల పనులు ప్రారంభించాలని రోగులు కోరుతున్నారు.

వెల్‌నెస్ సెంటర్లుగా..

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా నేషనల్ హెల్త్ మిషన్ కింద సబ్ సెంటర్లను ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్లుగా మార్చే ప్రక్రియను ప్రారంభించింది. జిల్లాలో 25 హెల్త్ సబ్ సెంటర్లలో వెలనెస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో ఓపీ చూడడంతోపాటు గర్భిణులను గుర్తించి ప్రసవాలు చేయించాలి. చిన్నపిల్లలకు టీకాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, జాతీయ నులిపురుగుల నివారణ మందుల పంపిణీ, పోలియో టీకాలు, టీబీ, బోధకాల వ్యాధిగ్రస్తులకు మందులు అందజేయనున్నారు.

హాస్టల్‌కు రావడానికి అనాసక్తి

- భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య
- 20 రోజులైనా 20 మందే చేరిక
- అధికారులు ఆత్మస్థైర్యం కల్పించినా విముఖత



భువనగిరిలోని ఎస్సీ బాలికల వసతి గృహం

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో చేరడానికి విద్యార్థినులు విముఖత కనబరుస్తున్నారు. హాస్టల్‌లో ఈనెల 3న ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులంతా తమ ఇళ్లకు వెళ్లిపోయారు. సంఘటన చోటు చేసుకుని 20 రోజులు గడిచినా తిరిగి హాస్టల్‌కు రావడం లేదు.

మొత్తం 112 మంది విద్యార్థులు

ఎస్సీ బాలికల వసతి గృహంలో 3నుంచి 10వ తరగతి వరకు 112 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులను తిరిగి హాస్టల్‌కు తీసుకువచ్చేందుకు అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి భరోసా కల్పించి ఆత్మస్థైర్యం నింపుతున్నారు. ప్రధానంగా 12మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి మార్చి 18 నుంచి వార్షిక పరీక్షలు ఉన్నాయి. వీరికి విద్యాపరంగా ఇబ్బంది కలగకుండా వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో పాటు విద్యార్థినులతోనూ మాట్లాడారు.అయినా విద్యార్థులు అనాసక్తి కనబరుస్తున్నారు.తల్లిదండ్రులు కూడా ఆసక్తి చూపడం లేదు.ఇప్పటి వరకు 20మంది మాత్రమే హాస్టల్‌కు చేరుకున్నారు.ఇందులో పదో తరగతి విద్యార్థి ఒకరు ఉన్నారు. మిగతా వారంతా గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

బీసీ వసతి గృహంలోనూ అదే తీరు

ఎస్సీ బాలికల హాస్టల్ పక్కనే బీసీ బాలికల కళాశాల వసతి గృహం ఉంది. ఎస్సీ హాస్టల్ ఘటన అనంతరం బీసీ బాలికల వసతి గృహం విద్యార్థులు కూడా భయాందోళనతో స్వగ్రామాలకు వెళ్లి తిరిగి రావడం లేదు. ఈ హాస్టల్‌లో 130 మంది విద్యార్థులు ఉండగా అధికంగా విద్యార్థినులే ఉన్నారు. ఇప్పటి వరకు 47 మంది వచ్చారు.

కొత్త భవనాల కోసం ప్రయత్నాలు

బాలికల ఎస్సీ, బీసీ హాస్టల్ భవనాలను మరోచోటకు తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త భవనాల కోసం అన్వేషిస్తున్నారు. కానీ, అనువైన భవనాలు లభించడం లేదు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

గుండాల : పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే తెగుళ్లను సులభంగా నివారించవచ్చని శాస్త్రవేత్తలు డాక్టర్ మధు, ఉపేందర్, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ సూచించారు. నేలతల్లి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో గుండాల మండల కేంద్రంలోని సుద్దాల కార్యాలయంలో నాబార్డు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయం సంయుక్తంగా రైతులకు భూసార పరీక్షలపై శిక్షణ ఇస్తున్నాయి. బుధవారం వారు శిక్షణ తరగతుల్లో పాల్గొని రైతులకు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలు సాగు చేస్తే మంచి ప్రయోజనాలు ఉంటాయన్నారు. అలాగే బ్యాంకు రుణాలు పొంది రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మంద రాములు, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు శివసాయికృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను నిలబెడుదాం

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

భువనగిరి రూరల్, బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట రూరల్ : ప్రభుత్వ బడులను నిలబెట్టేందుకు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడి నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతీ ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. బుధవారం భువనగిరి, బొమ్మల రామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 27వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 21లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. వీటిని అభివృద్ధి చేస్తే మరో 20 లక్షల మంది విద్యార్థులకు చదువు చెప్పవచ్చన్నారు. ప్రతి తరగతికి గది, ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు, సర్వీస్ పర్సన్, తరగతుల నిర్వహణకు ఇద్దరు టీచర్లు ఉండాలన్నారు. అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఏం చేస్తే తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతారో అధ్యయనం చేసి విద్యాశాఖకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని సమభావన సంఘాల మహిళలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు ఎందుకు పంపించడం లేదని డీఆర్‌డీఏ అధికారుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, జిల్లా ఉపాధ్యక్షురాలు సంగు వనిత, కార్యదర్శి కె.రాజగోపాల్, కోశాధికారి మల్లేశం, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు హరిశంకర్, వెంకన్న, మురళీ, సోమ సత్తిరెడ్డి, కస్తూరిబా గాంధీ విద్యాలయాల రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, భిక్షమయ్య, పరమేశ్, జ్యోతి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నాగలింగం, ఎంఈఓ కృష్ణ, నాగార్జున, సిల్వేరు మహేష్, జీవీ రమణారావు, సిద్దులు, సుదర్శన్ రెడ్డి,శివనారాయణ, శ్రీనివాస్, ఎంఎస్‌ఓ మాలతి, శ్రీనివాస్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే ధ్యేయం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : నియోజకవర్గ రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందించడమే లక్ష్యమని, అందుకోసం బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వలిగొండలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సాగు నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సాగు నీటి కాల్వలకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీరుపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం కూడా అందజేసినట్లు తెలిపారు. నిధుల మంజూరీకి వారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవ పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, జెడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాల నర్సింహ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి

- కాంగ్రెస్‌వి అమలుకు సాధ్యంకాని హామీలు
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్
- రెండో రోజు కొనసాగిన విజయ సంకల్ప యాత్ర





ఆలేరు : విజయ సంకల్పయాత్రలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు, అభివాదం చేస్తున్న ఈటల రాజేందర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

ఆలేరురూరల్, మోత్కూరు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం) : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. విజయ సంకల్ప యాత్ర బుధవారం ఆలేరు, మోత్కూరు, మోటకొండూరు మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టాక దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు.రామగుండం ఎరువుల కర్మాగారాన్ని తెరిపించారని, నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేశారని, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లను ఆధునీకరించి వసతులు కల్పించిందన్నారు.టాయిలెట్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. కాజీపేటలో వ్యాగన్ల కంపెనీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలకు మోదీ అండగా నిలిచారని పేర్కొన్నారు. మోదీని మూడోసారి ప్రధానిగా ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో 17 ఎంపీ స్థానాలను గెలిపిస్తే కేంద్రం నుంచి రూ.లక్ష కోట్ల తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. 14 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారని, వాటికి సుమారు రూ.50 వేల కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. 930పి జాతీయ రహదారిని యాదాద్రి - భద్రాద్రిగా పిలవాలని కోరారు.ఆయా గ్రామాల్లో విజయ సంకల్ప యాత్రకు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.విజయ సంకల్పయాత్రలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల శ్రీనివాస్, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, నాయకులు చెరిగె శ్రీనివాస్, జహంగీర్, రాఘవేంద్ర, మహేష్, సుభాష్, ఆనంద్, పోచం సోమయ్య, ధీటి సందీప్, గుజ్జ సోమ నర్సయ్య, ఏనుగు జితేందర్‌రెడ్డి, మరాటి అంజయ్య, గూడ మధుసూదన్, జోరుక ఎల్లేష్, పీసరి తిరుమలరెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, అనంతుల పాండురంగారెడ్డి, చిర్ర రవీందర్, భూరెడ్డి జనమే జయరెడ్డి, గాజుల ప్రవీణ్‌గౌడ్, బైరపాకస్వామి,దాసరి మల్లేశం, వంటిపెల్లి శ్రీనువాస్‌గౌడ్, బొట్టు అబ్బయ్య, మజ్జిగ నరేష్, గజరాజు కాశీనాథ్, బబ్బూరి లింగం తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీల్లో ఇప్పటి వరకు ఏ ఒక్కటీ చేయలేదన్నారు.ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఒక్కటే అమలు చేసిందని, అయితే ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు బస్సులను పెంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పుల కోసం కేంద్ర చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. మేడిగడ్డపై సీబీఐ విచారణ జరిపిస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక మాట మార్చిందన్నారు. రాజకీయ లబ్ధికోసే మేడిగడ్డను వాడుకుంటుందన్నారు.

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

నార్కట్‌పల్లి : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పరిసమాప్తం అయ్యాయి. చివరి రోజు ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పం తదితర వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, ఉప ప్రధానార్చకుడు ఉప్పల సతీష్‌శర్మ, మామిళ్లపల్లి రాంబాబుశర్మ పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ప్రియుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన

శాలిగౌరారం: ప్రేమించి పెళ్లికి నిరాకరించి మోసానికి పాల్పడిన ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి ఆందోళనకు దిగింది. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆకారం గ్రామానికి చెందిన ఇంద్ర కంటి వెంకటేశ్, దుప్పెల్లి ఝాన్సీలు నాలుగేళ్లగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పెళ్లి చేసుకునేందుకు కూడా నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిశ్చితార్థం కూడా జరిగింది. పెళ్లి చేసుకునే సమయం దగ్గర పడటంతో ఏర్పాట్లు చేసుకుంటుండగా వెంకటేశ్ ఝాన్సీని నిరాకరించాడు. దీంతో ఝాన్సీ తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఝాన్సీ ధర్నాకు ఆమె కుటుంబీకులతో పాటూ స్థానిక మహిళలు, మహిళా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌పై కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

PUBLIC NOTICE

IN THE COURT OF THE HON'BLE PRL SENIOR CIVIL JUDGE AT BHONGIR

OS No 56 OF 2023

BETWEEN:-

M/s Kulalakshmi Estates Pvt Ltd ...PLAINTIFF

AND

Meesala Venkatesh & another ...DEFENDANTS

Defendant No 1 & 2

1. Meesala Venkatesh, s/o late Meesala bikshapthi R/o H No 9-2-286/A/14, Golla Basti, Langer House, Golconda, Hyderabad 500 008
2. Vakiti Aaggi Reddy, s/o Vakiti Yadi Reddy R/o Padamati Somaram village, Bibinagar mandal, Yadadri Bhuvanagiri district

The above named Plaintiff has filed the above suit for Perpetual. You are the Defendant Nos 1 & 2 in the above suit. You are hereby directed to appear before the Hon'ble Prl Senior Civil Judge at Bhongir on 01-03-2024 at 10:30 am either in person or through an Advocate, failing which the matter will be decided in accordance with Law.

BY ORDER OF THE COURT
V V L Sujatha
Advocate

PUBLIC NOTICE

IN THE COURT OF THE HON'BLE PRL SENIOR CIVIL JUDGE AT BHONGIR

IA No 375 OF 2023

IN

OS No 56 OF 2023

BETWEEN:-

M/s Kulalakshmi Estates Pvt Ltd ...PETITIONER/ PLAINTIFF

AND

Meesala Venkatesh & another ...RESPONDENTS/DEFENDANTS

Respondent No 1 & 2 / Defendant No 1 & 2

1. Meesala Venkatesh, s/o late Meesala bikshapthi R/o H No 9-2-286/A/14, Golla Basti, Langer House, Golconda, Hyderabad 500 008
2. Vakiti Aaggi Reddy, s/o Vakiti Yadi Reddy R/o Padamati Somaram village, Bibinagar mandal, Yadadri Bhuvanagiri district

The above named Petitioner/Plaintiff has filed the above IA for grant of Ad-Interim Injunction in the suit. You are the Respondent/Defendant Nos 1 & 2 in the above IA. You are hereby directed to appear before the Hon'ble Prl Senior Civil Judge at Bhongir on 01-03-2024 at 10:30 am either in person or through an Advocate, failing which the matter will be decided in accordance with Law.

BY ORDER OF THE COURT
V V L Sujatha
Advocate

వన దేవతల జాతరలు ప్రారంభం



పెన్‌పహాడ్ : నైవేద్యం సమర్పించేందుకు బోనాలతో వస్తున్న మహిళలు



పెన్‌పహాడ్ : వనదేవతలను దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

- గద్దెపైకి సారలమ్మ.. నేడు రానున్న సమ్మక్క
- పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

పెన్‌పహాడ్ : ఉమ్మడి జిల్లాలోని పెన్‌పహాడ్, పెద్దవూర, రాజాపేట మండలాల్లో మినీ మేడారాలుగా కీర్తించబడుతున్న వనదేవతల జాతరలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా మండలాల పరిధిలో జరుపుతున్న జాతరలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వనదేవతల గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ జిల్లా మేడారానికి చెందిన సమ్మక్కసారలమ్మ దేవతామూర్తులకు పోలిన జాతరగా పేరుగాంచిన పెన్‌పహాడ్ మండల పరిధిలోని గాజులమల్కాపురం సమ్మక్క–సారలమ్మ దేవతామూర్తులను దర్శించుకునేందుకు భకులు తరలివచ్చారు. గ్రామం నుంచి దేవతామూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెలపై ఉంచారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలు చెల్లించుకున్నారు. సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. బంగారం (బెల్లం) మొక్కుబడులుగా చెల్లించారు. నారికాయలు, గొర్రె, మేక పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చారు. నిర్వాహకులు తాగునీరు, లైటింగ్ సౌకర్యం ఏర్పాటుచేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శివలింగం, నాగుపాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తులు అమ్మవారి పూనకంతో ఊగిపోయారు. నేడు జాతర ఉత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాటం, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండి ధనమ్మ రామకృష్ణారెడ్డి, బండి మధుసూధన్‌రెడ్డి, కుందూరు ప్రభాకర్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, కుందూరు వెంకట్‌రెడ్డి, దొంతగాని గోపయ్య, బచ్చలకూరి రామచంద్రు, మండాది పాపయ్య, భేగం జాన్‌షా, బచ్చలకూరి జానయ్య పాల్గొన్నారు.



రాజాపేట : చల్లూరులో సారలమ్మను ఊరేగింపుగా తీసుకొస్తున్న నిర్వాహకులు

పెద్దవూరలో..

పెద్దవూర: పెద్దవూర మండలంలోని పొట్టిచల్మ ఎక్స్‌రోడ్డు వద్ద కృష్ణా నది సమీపంలో కొలువై భక్తుల కోర్కెలు తీర్చే మినీ మేడారంగా పిలిచే సమ్మక్క–సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం వనదేవతలైన సమ్మక్క–సారలమ్మ జాతరను ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలైన గుంజ అంజమ్మ, గుంజ షణ్ముఖరాజు, నాగపురి లక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవార్లకు చీరె సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సమీప గ్రామాల ప్రజలు వనదేవతలను సందర్శించి మొక్కులను సమర్పించారు. నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు.



పెద్దవూర : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని చల్లూరు యాదాద్రి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా విచ్చేసే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు బుధవారం నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా పొట్టిమర్రి, ఇబ్రహింపూర్ చౌరస్తాల నుంచి యాదాద్రి మేడారం అమ్మవార్ల గద్దెలవరకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఉచిత దర్శనం, షాపుల ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



చల్లూరు ఊరగుట్టపై ఏర్పాటు చేసిన గద్దెలు

గద్దెపైకి సారలమ్మ

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారంలో వనదేవతలు సమ్మక్క సారలమ్మలో భాగంగా ఎల్లమ్మ బోనాలతో జాతర ప్రారంభమైంది. బుధవారం చిన్నమేడారం, యాదాద్రి మేడారం సమీపంలోని గుట్టలపై ఉన్న సారలమ్మకు నిర్మాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వరాహాన్ని బలిచ్చి డప్పు వాయిద్యాలు, మేళతాలాలతో సమీప కుర్రారం, చల్లూరు గ్రామస్తులు ఊరేగింపుగా ఆలయాలకు బయలు దేరారు. దారిపొడువునా డుప్పు వాయిద్యాలతో శివసత్తుల పూనకాలతో హోరెత్తిపోయింది. ఆలయ ప్రాంగణాలకు చేరుకున్న నిర్వాహకులు సాంప్రదాయ పూజలు నిర్వహించి కుంకుమ భరిణె రూపంలో ఉన్న వెదురు బొంగు సారలమ్మ గద్దెపై ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణాలు జన సంద్రంతో కిక్కిరిసి పోయాయి. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని వడిబియ్యాలు, పసపు, కుంకుమలు, కొబ్బరియాలు, కోళ్లు మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం పరిసరాల్లో మిఠాయి, బొమ్మలు, గాజుల వంటి వివిధషాపులు వెలిసాయి. గురువారం సమ్మక్క గద్దెలపైకి రానుందని వనదేవతలు కొలువు తీరడంతో శుక్రవారం భక్తులు మొక్కులు తీర్చుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

భారీ బందోబస్తు

మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్, రాజాపేట ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డితోపాటు 9మంది ఎస్‌ఐలు, 90 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం తిరుమలగిరి మండలంలోని జానారెడ్డి కాలనీ గ్రామశివారులో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న జటావత్ రమేష్, రమావత్ భాస్కర్, బొజ్జ సాంబశివరావు, ఉడ్తూరి రమణారెడ్డి, రమావత్ కమల, పొదిల మల్లయ్య, జటావత్ శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 35,580 నగదు, ఏడు మోటార్ సైకిళ్లు, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నారాయణరెడ్డి తెలిపారు.

పుస్తెల తాడు అపహరణ

చివ్వెంల(సూర్యాపేట) : గుర్తుతెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడు అపహరించాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపురం గ్రామానికి చెందిన కళ్ల రాములమ్మ తన ఇంట్లో వరండాలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. గమనించిన వృద్ధురాలు కేకలు వేయడంతో పక్క గదిలో నిద్రిస్తున్న కుటుంబ సభ్యుల లేచి చూసే వరకు అప్పటికే పరారయ్యాడు. బాధితురాలు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

పెండింగ్ వేతనాల విడుదల హర్షణీయం

నేరేడుచర్ల: అర్చకులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయడం హర్షణీయమని ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంబొట్ల ఫణికుమార్ శర్మ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని చలో సెక్రటరేట్ పిలుపునివ్వడంతో ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలను విడుదల చేయాలని ఆదేశించిందన్నారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మాడుగులపల్లి : మాడుగులపల్లి తాజా మాజీ సర్పంచ్ తూనం శోభ ఆత్మహత్యకు యత్నించింది. మాడుగులపల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో బుధవారం బొద్దింకల మందు (హిట్) తాగింది. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికిలోనై ఆమె బలవన్మరణానికి యత్నించినట్లు తెలుస్తోంది. శోభ భర్త రవికి కొంతకాలంగా కొంతమందితో ఆర్థిక పరమైన విషయాల్లో వివాదాలు నడుస్తున్నాయి. ఈ విషయమై ఉదయం వారు మాట్లాడేందుకు రాగా ఆమె మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి బొద్దింకల మందు తాగింది. స్థానికులు 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి బాధితురాలిని చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

ముగిసిన కబడ్డీ పోటీలు



మొదటి బహుమతి అందుకుంటున్న సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు

- ప్రథమ బహుమతి సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు కైవసం

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో ఆల్ ఇండియా మహిళా కబడ్డీ పోటీల్లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ సికింద్రాబాద్, హర్యానా జట్టుల మధ్య హోరా హోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు విజయం సాధించింది. ప్రథమ బహుమతి కింద ఆ జట్టు రూ.లక్ష నగదుతో పాటు షీల్డ్ అందుకుంది. హర్యానా జట్టు ద్వితీయ బహుమతి గెలిచుకొని రూ.90వేలు, షీల్డు అందుకుంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు సాగిన డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో 13జట్లు 195 మంది క్రీడాకారులు, టీమ్ కోచ్‌లు పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్ తృతీయ స్థానం పొందింది. రూ.80వేలు, షీల్డు అందజేశారు. నాల్గువ బహుమతి ఆంధ్రప్రదేశ్, ఐదవ బహుమతి బెంగళూర్ సిటీ, అరవ బహుమతి గురుకుల హర్యానా టీమ్, ఏడవ బహుమతి ఎస్‌ఎస్‌ఎస్ పానిపట్టు హర్యానా టీమ్, ఎనిమిదో బహుమతి ఎస్‌ఎస్‌పి గుజరాత్ టీమ్, తొమ్మిదవ బహుమతి ఎస్‌ఎస్ అకాడమీ ఢిల్లీ, పదో బహుమతి పీటీబీ పుణే సాధించినట్లు క్రీడల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సుందరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్వర్ యాదవ్, జగన్‌మోహన్‌లతో పాటు సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రామినేని భూలోకరావు, రాందర్, అన్నపురెడ్డి అప్పిరెడ్డి, గుండెపునేని చక్రధర్‌రావు, జుట్టుకొండ సత్యనారాయణ, చలసాని శ్రీనివాస్, క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులు హాజరయ్యారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద మొత్తంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని కబడ్డీ పోటీలను తిలకించారు.



రెండో బహుమతి అందుకుంటున్న హరియాణ టీమ్

మహిళ అదృశ్యం



బొడ్డు సుభద్ర

గుర్రంపోడు : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. గుర్రంపోడు మండలం తేనేపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సుభద్ర (32)ఈ నెల ఒకటవ తేదీన భర్త కిరణ్‌తో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇరవై రోజులుగా చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి కుటుంబ సభ్యులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడు మృతి



ఘటనా స్థలంలో శంకరయ్య మృతదేహం

మునుగోడు: బైక్ అదుపు తప్పి మురుగు కాల్వలలో పడడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మునుగోడులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన భీమనపల్లి శంకరయ్య (75) మునుగోడులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరుగుతున్న తమ గ్రామానికి చెందిన యువకుడి వివాహానికి బైక్‌పై హాజరయ్యాడు. వివాహం అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా కమ్మగూడెం వద్ద రక్తపోటు అధికమై మురుగు కాల్వలో కిందపడిపోయాడు. ప్రమాదంలో శంకయ్య తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీరాహుల్ హెగ్డే

మేళ్లచెరువు (సూర్యాపేట): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ ఎస్పీ రాహుల్‌హెగ్డే నిందితుడి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన బొజ్జగాని రోహిత్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. ఇతను 120 గ్రాముల గంజాయిని మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించేందుకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు రోహిత్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. అతన్ని అరెస్టు చేసి ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న స్థానిక ఎస్.ఐ.పరమేష్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఉరేసుకుని ఆత్మహత్య

నార్కట్‌పల్లి : ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నార్కట్‌పల్లి మండలం దాసరిగూడెంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దాసరిగూడెం గ్రామానికి చెందిన పాలగోని యోగిత్ (26)కు తన భార్య ప్రవళికతో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రవళిక ఇటీవల పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన యోగిత్ బుధవారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

పెద్దఅడిశర్లపల్లి : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దఅడిశర్లపల్లి మండలం నంభాపురం గ్రామానికి చెందిన రమావత్ భీమా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భీమా రెండు మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతడికి స్థానికంగా వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో హాలియాలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు డాక్టరు నిర్ధారించాడు. భీమా మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య సైదీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

గొర్రెలు అపహరణ

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలను అపహరించారు. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం శివారులో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన రేగట్టె భూపాల్ రెడ్డి వ్యవసాయంతో పాటు ఎల్లారెడ్డిగూడెం శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో షెడ్డు వేసి గొర్రెలను పెంచుతున్నాడు. వాటి ఆలనా పాలనకు సూపర్‌వైజర్‌ను కూడా నియమించాడు. ఈ నెల 15వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి షెడ్డులోని 110 గొర్రెలను అపహరించుకుపోయారు. మరుసటి రోజు సూపర్‌వైజర్ వచ్చి చూడగా గొర్రెలు కనిపించకపోవడంతో యజమానికి సమాచారం ఇచ్చారు. భూపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

యాసంగి వరిచేలకు తెగుళ్ల బెడద

- ఎండిపోతున్న చేలు.. ఆందోళనలో రైతులు
- నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్

పెద్దవూర: వాతావరణంలోని మార్పులతో యాసంగి వరి పంటకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. అసలే నీటి ఎద్దడి.. ఆపై తెగుళ్ల బెడదతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, ఎండ, చల్లదనం వలన యాసంగి వరిపంటపై సుడిదోమ, కాండం తొలిచే పురుగు, రసం పీల్చేపురుగులు, తుప్పు తెగులు, మాగుడు వంటివి ఎక్కువగా ఆశిస్తాయని, వీటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను పెద్దవూర వ్యవసాయ అధికారి పి.సందీప్‌కుమార్ ‘సాక్షి’కి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఎర్రనల్లి తెగులు : రసం పీల్చేపురుగుల్లో ఎర్రనల్లి ప్రమాదరకమైంది. ఈ తెగులు ఎండలు అధికంగా ఉన్నప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో మాన్‌సూన్ బ్రేక్ వచ్చినప్పుడు ఈ తెగులు పంటను ఆశిస్తుంది.

తెగులు లక్షణాలు: ఇది సోకిన వరిపంట ఎదుగుదల నిలిచిపోతుంది. ఆకులను ఆశించిన ఎర్రనల్లి పత్రహరితాన్ని తినివేయడంతో ఎర్రబడిపోతాయి. కిరణజన్య సంయోగ క్రియ జరగకపోవడంతో మొక్క ఎదుగుదల నిలిచిపోతుంది.



తెగులు సోకి ఎండిపోయిన వరిచేను

నివారణ చర్యలు: ఎర్రనల్లి పురుగులను నివారించటానికి లీటర్ నీటిలో 5 మి.లీ. డైకోఫాల్ లేదా 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం కలిపి పిచికారీ చేయాలి. ఇలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

మాగుడు లేదా పొడతెగులు : గ్రామీణ ప్రాంతాల్లో ఈ తెగులును మాగుడు లేదా పొడతెగులు అంటారు. ఈ తెగులు అధిక ఎండలు, గాలిలో తేమశాతం 90శాతం ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేను చూస్తుండగానే ఎండిపోతుంది.

నివారణ చర్యలు: ఈ తెగులు సోకిన పంటకు ముందస్తుగా రైతులు ఎంతమేర సోకిందనేది గుర్తించాలి. దీని నివారణకు ఎకరానికి 400 మి.లీ. ఎక్సోకోనోజాల్ పిచికారీ చేయాలి. లేదా 200 మి.లీ. ప్రిప్రీకోనోజాల్ లేదా 400 మి.లీ.వాలిడామైసిన్‌ను ఒక మిల్లీలీటర్‌కు 2 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి. వీటిని రెండో దఫాగా 15 రోజులకు పిచికారీ చేయాలి.



పాడి పంట

తుప్పు తెగులు : ఈ తెగులు ఆశించిన వరి ఆకులపై గోధుమ వర్ణంలో తుప్పు పట్టినట్లుగా మచ్చలు ఏర్పడి క్రమేపీ పెద్దవై ఆకులో పత్రహరితం లేకుండా పోతుంది. ఇలా అవడం వలన ఆకులు ఎండిపోయి క్రమేణ దుబ్బు కూడా ఎండిపోతుంది. ఈ తెగులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చూస్తుండగానే చేను ఎండిపోతుంది.

నివారణ చర్యలు: ఎకరానికి 200 గ్రాముల కార్బండిజమ్‌ను తీసుకుని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన వారం రోజులకు మచ్చలు ఇంకా ఉన్నట్‌లెతై మరో దఫా పిచికారీ చేయాలి.

అగ్గితెగులు : ఈ తెగులు గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేలు ఆకులపై ముదురు గోధుమ మచ్చలు, ఆకులు ఎండిపోయి తగులబడినట్లుగా కనిపిస్తాయి. వెన్ను మెడభాగంలో ఈ తెగులు వ్యాపిస్తుంది. వెన్ను విరిగిపోతుంది. అంతేకాకుండా ఎరువుల్లో నత్రజని ఎక్కువైనప్పుడు కూడా ఈ తెగులు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: ఈ తెగులు ఆశించిన చేల చుట్టూ గట్లపై గడ్డిని పూర్తిగా నివారించాలి. లీటర్ నీటిలో 6 గ్రా. ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.

ఎండు ఆకుతెగులు: ఇది బ్యాక్టీరియా వలన వస్తుంది. ఆకుల అంచుల నుంచి పసుపు రంగుకి మారి ఆకులు క్రమేపీ ఎండిపోతాయి. ఎక్కువగా అధిక వర్షాలు కురిసినప్పుడు గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: ఇది సోకిన వరి చేలు చూస్తుండగానే ఎండిపోతాయి. నివారణకు ఎకరాకు 500 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచుపురుగు: ఇది పంట చిరుపొట్టదశలో ఉన్నప్పుడు ఆశిస్తుంది. దీనివలన పంట ఈనిన తర్వాత తెల్ల కంకులు ఏర్పడతాయి. దీని నివారణకు ఎకరాకు 60మి.లీ. కారజోన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ : సుడిదోమ కాండం మొదలుకు చేరి రసం పీల్చివేయడంతో ఆకులు పసుపు రంగులోకి మారిపోయి సుడులుసుడులుగా ఎండిపోతుంది. దీనిని త్వరగా అరికట్టకపోతే చేను అంతా ఎండిపోతుంది.

నివారణ చర్యలు: వరిదుబ్బుకి దోమలు 10 నుంచి 15 ఉంటే ఎకరానికి 120 మిల్లీలీటర్ల మెట్రోజోల్ మందును, 25 నుంచి 50 దోమలు ఉంటే ఎకరానికి 300 మి.లీ. హితోఫిన్‌ప్లాక్స్‌ను, 50 దోమలు దాటితే దీని తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వీని నివారణకు ఎకరానికి 300 మి.లీ. ఎసిఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.